
సాక్షి
గుంటూరు

మంగళవారం । 27 । ఆగస్టు । 2024




సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం సోమవారం 589.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,104 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



పులిచింతలలో నీటి నిల్వలు

అచ్చంపేట: పులిచింతల్లలో నీటి నిల్వ 45.51 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 32708 క్యూసెక్కులు చేరుతుండగా దిగువకు ఒక గేటు ద్వారా 33268 క్యూసెక్కులు వదలుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 7508 క్యూసెక్కుల విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 330, బ్యాంక్ కెనాల్‌కు 1889 క్యూసెక్కులు విడుదల చేశారు.



మానవ సమాజంలో బతుకుతున్నామా?

వైద్య విద్యను అభ్యసించి ఎంతో మందికి సేవ చేయాలనే ఉద్దేశంతో విద్యార్థుల్ని చదివించేందుకు తల్లిదండ్రులు ఎంతో కష్టపడతారు. వారి ఆశను నెరవేర్చి విద్యపూర్తి చేవుకోవాలనే లక్ష్యంతో ఎంతో దూరం నుంచి వచ్చి చదువుతుంటారు. కోల్‌కతా లాంటి ఘటనలు తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఘటన వింటుంటే మనం మానవ సమాజంలో బతుకుతున్నామా ? అని భయమేస్తోంది.

– డాక్టర్ పి.అనూష, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్, ఇందిరానగర్, మంగళగిరి



ఘటనతో భయమేస్తోంది



కోల్‌కతాలో జరిగిన ఘటనతో భయమేస్తోంది. వెలుగులోకి వస్తున్న నిజాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే విద్యార్థినులు ధైర్యంగా ముందుకు వచ్చి చదువుకుంటున్నారు. ఇలాంటి ఘటనలతో మరలా ఇళ్లకే పరిమితమై పరిస్థితులు ఏర్పడతాయి. నిందితుడితో పాటు కారణమైన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వాలు కఠినంగా శిక్షించి విద్యార్థినులు, తల్లిదండ్రుల్లో ధైర్యం నింపాలి.

– డాక్టర్ భారతి, మంగళగిరి

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



అమరావతి: అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థాన క్షేత్ర పాలకుడైన వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వేమూరి గోపీనాథ శర్మ ఆధ్వర్యంలో అర్చకుడు కేశవాచార్యులు స్వామివారికి వేకువజామున పంచసూక్తాలతో పంచామృత స్నపన జరిపారు. పలు రకాల పుష్పాలతో అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతర స్వామివారి సహస్రనామ పూజ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు.

ముగిసిన అమరేశ్వరుడి పవిత్రోత్సవాలు



అమరావతి: అమరావతిలోని అమరేశ్వరాలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు వేద పండితులు శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు. మండప పూజలు, మండప దేవతా హోమాలు, ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనం, ఆశీర్వచనం జరిపారు. దాతలు యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి సహకారంతో నిర్వహిస్తున్న ఈ పవిత్రోత్సవాలలో మూడో రోజున ఉపాలయాలలో పూజలు నిర్వహించారు. అనంతరం మండప దేవతా హోమాలు జరిపారు. ప్రాయశ్చిత్త హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించి, మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించిన పవిత్రోత్సవాలను ముగించారు. కలశానికి ఉద్వాసన చేసి కలశాలలోని పుణ్యజలాలతో స్వామివారికి అవభృత అభిషేకం నిర్వహించారు. మూడు రోజులపాటు స్వామివారికి ధరింప చేసిన పవిత్రాలను తొలగించి విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా
ప్రయాణికులంతా సురక్షితం



విజయపురిసౌత్: హైదరాబాద్ నుంచి మాచర్ల వస్తున్న ఆర్టీసీ బస్సు నాగార్జునసాగర్–మాచర్ల ప్రధాన రహదారి ఏకోనాంపేట వద్ద సోమవారం ఉదయం అదుపు తప్పి బోల్తా పడింది. మాచర్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న 11 మంది ప్రయాణికులతోపాటు డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. ఉదయం నాలుగు గంటలకు ప్రమాదం జరగగా సమాచారం అందుకున్న విజయపురిసౌత్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. త్రుటిలో ప్రమాదం నుంచి ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

పంగులూరులో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు
సెప్టెంబర్ 20,21,22 తేదీల్లో నిర్వహణ

జే.పంగులూరు: పంగులూరులో సెప్టెంబర్ 20,21,22 తేదీల్లో అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గరటయ్య మాట్లాడారు. గ్రామస్తుల సహకారంతో ఇప్పటికి 10 సార్లు రాష్ట్ర పోటీలు, మూడు సార్లు జాతీయ స్థాయి పోటీలు అంత్యత వైభవంగా నిర్వహించనట్లు తెలిపారు. ఈసారి పోటీల్ని సైతం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీల వెంకటసుబ్బారావు, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి కాశీ విశ్వనాథరెడ్డి, ట్రెజరర్ హనుమంతురావు, రొటేరీయన్లు వీరరాఘవయ్య, సింగర్, సాంబశివరావు, హనుమంతురావు, సుబ్బారావు పాల్గొన్నారు.

అరకొరగా రాగుల పంపిణీకి రెడీ!

- సెప్టెంబరు ఒకటి నుంచి రేషన్ కార్డుదారులకు సరఫరా
- ప్రయోగాత్మకం పేరుతో షాపు పరిధిలో వంద మందికే..
- రెండు నెలల్నుంచి ఆగిన చక్కెర కూడా పంపిణీ
- మరోవైపు అక్రమ తరలింపులు మామూలే!

తెనాలి: రేషన్ కార్డుదారులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా రాయలసీమలో పంపిణీ చేసిన రాగులును సెప్టెంబరు ఒకటి నుంచి గుంటూరు జిల్లాలోనూ ఆరంభించనున్నారు. ప్రయోగాత్మకం పేరుతో ఒక్కో రేషను షాపునకు కొద్ది మొత్తంలోనే పంపిణీ జరగనుంది. రెండు నెలలుగా నిలిపివేసిన చక్కెరను కూడా ఇదే నెలలో ఇవ్వనున్నారు.

కార్డుదారులకు మూడు కిలోలు

గుంటూరు జిల్లాలో 5,99,511 రేషను కార్డులున్నాయి. వీరందరికీ పంపిణీ నిమిత్తం 17,98,533 కిలోల రాగుల్ని ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో మొత్తం 972 రేషను షాపులున్నాయి. కార్డుదారులకు వచ్చే నెలలో బియ్యంతో పాటు రాగుల్ని ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేసింది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి వీటిని రేషను షాపులకు అందజేస్తున్నారు. ప్రయోగాత్మకంగా ఒక్కో రేషను షాపు పరిధిలో వంద కార్డుదారులకు మూడు కిలోల చొప్పున 2–3 క్వింటాళ్లను మాత్రమే ఇస్తున్నారు. ఆ ప్రకారం ఒక్కో రేషను కార్డులో ఎంతమంది సభ్యులున్నా కార్డు యూనిట్‌గా మాత్రమే ఇస్తారు. అంటే కార్డులో నలుగురు సభ్యులుంటే, అయిదేసి కిలోల చొప్పున ఇచ్చే బియ్యంలో, రాగుల్ని మినహాయించి మిగిలిన 17 కిలోల్ని పంపిణీ చేయనున్నారు. కార్డుదారులు రాగులు వద్దనుకుంటే మొత్తం 20 కిలోల బియ్యాన్ని ఇస్తారు. అదికూడా వంద రేషను కార్డుదారులకే సుమా!



రేషను షాపుకు చేరిన రాగుల బస్తాలు

అక్కరకు రానున్న చక్కెర

బియ్యంతోపాటు కార్డుకు అర కిలో చొప్పున పంపిణీ చేసే చక్కెర గత రెండు నెలలుగా ఇవ్వడం లేదు. పౌరసరఫరాలశాఖ మంత్రిగా స్థానిక ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ బాధ్యతలు చేపట్టాక, స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేశారు. అరకిలో ప్యాకెట్‌లో 50 గ్రాముల తూకం తక్కువగా ఉండటంతో విచారణ నిమిత్తం పంపిణీని నిలిపివేయించారు. వాస్తవానికి 50 కిలోల చక్కెర ప్యాకెట్ల బస్తాను తూకం వేస్తే 50 కిలోలు తూగింది. విడివిడిగా ఒక్కో ప్యాకెట్‌ను తూకం వేసినపుడు ఈ తేడా కనిపించింది. అయితే నాలుగు వేల కిలోలను తూచే కాటాలో అర కిలో ప్యాకెట్‌ను వేయడంతో ఈ వ్యత్యాసం వచ్చిందని చెబుతున్నారు. తర్వాత వీటిని విడివిడిగా తూకం వేసినపుడు ఒక్క ప్యాకెట్ 490 గ్రాములు తూగితే, మరో ప్యాకెట్ 510 గ్రాములు తూగిందని సమాచారం. ఏది ఏమైనా ఈ నెలనుంచి కార్డుదారులకు చక్కెర పంపిణీని పునఃప్రారంభించనున్నారు. గతంలో నిలిపివేసిన చక్కెర నిల్వల్ని కూడా కార్డుదారులకు అందించనున్నారు.



పంపిణీ చేయనున్న రాగులు


రెచ్చిపోతున్న అక్రమార్కులు

ఎండీయూ వాహనాల్లో రేషను పంపిణీ చేసేటపుడు పలువురు నేరుగానే కార్డుదారులకు కిలోకు రూ.11, రూ.12 చొప్పున నగదు ఇస్తూ, బియ్యాన్ని కొంటున్నారు. అయితే అక్రమార్కులు అంతకన్నా ముందుగానే సరుకు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషను షాపుకు వచ్చీరాగానే కొన్ని బస్తాల బియ్యాన్ని బయటకు విక్రయిస్తున్నారు. వీటిని ఎవరూ తనిఖీ చేయడం లేదు. ఈనెల 18వ తేదీన రేషను షాపుల సరుకు నిల్వల అకౌంట్స్ ముగించేశారు. ప్రతి షాపునకు ముగింపు నిల్వల వివరాలు ఏఈపీడీఎస్ పోర్టల్‌లో స్పష్టంగా ఉంటాయి. ఇది పబ్లిక్ డొమైన్. ఎవరికైనా వివరాలు తెలిసిపోతాయి. సంబంధిత అధికారులు ఆ వివరాలతో రేషను షాపుల్ని తనిఖీ చేస్తే అక్రమాలకు పాల్పడే రేషను డీలర్లు దొరికిపోతారు. ప్రభుత్వం ఆ పని చేయడం లేదు. పైగా డీలర్లకు అధికార పార్టీ నాయకులే అండగా ఉండటంతో రెచ్చిపోతున్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రి సొంత నియోజకవర్గంలోనూ రేషను అక్రమార్కులు ఉన్నారని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి
జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



నగరంపాలెం: వినాయక చవితి పండుగకు జిల్లాలో పందిళ్లు, మండపాల ఏర్పాటుచేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిమల ప్రతిష్ఠకు ఐదు లేదా ఎక్కువ మందితో కమిటీగా ఏర్పడి, వివరాల్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందించాలని సూచించారు. కమిటీ గుర్తింపు కార్డు నకళ్లను జత చేయాలన్నారు. ప్రైవేటు, పంచాయతీ, మున్సిపాల్టీ స్థలాల్లో వినాయకుని విగ్రహాల ఏర్పాటుకు ముందు యాజమానుల నుంచి అనుమతి ఉండాలని స్పష్టం చేశారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల నిబంధనల ప్రకారం పందిళ్లు, మండపాల వద్ద ఇసుక, నీళ్లను నిల్వ చేయాలని తెలిపారు. విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవాలు, నిమజ్జనం తేదీలు, మార్గం, వాహనాల వివరాల్ని పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. పందిళ్లు, మండపాలను రహదారులపై ఏర్పాటు చేయవద్దని, బ్యానర్లు, ఫ్లెక్సీలతో ప్రజల రాకపోకలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు. ఊరేగింపుల్లో బాణసంచా పేల్చవద్దని, అనుచిత నృత్యాలు, అసభ్య నాట్య ప్రదర్శనలు ప్రదర్శించవద్దని తెలిపారు. నిమజ్జనానికి వెళ్లే వాహనాలపై మద్యం తాగిన వారు, మైనర్లు ఉండరాదని స్పష్టం చేశారు.



గుంటూరులోని ఇస్కాన్ టెంపుల్‌లో ఉట్టి కొడుతున్న యువత

శరణాగతం కృష్ణా!

నల్లనయ్య పుట్టిన రోజు సందర్భంగా కృష్ణాష్టమి వేడుకలు గుంటూరు నగరంలో కోలాహలంగా జరిగాయి. మదనగోపాలుడిని దర్శించుకునేందుకు ఆబాల గోపాలం ఉవ్విళ్లూరింది. కృష్ణ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని ఇస్కాన్ టెంపుల్, గౌడియ మఠంలో నల్లనయ్య రాధాసమేతంగా, నయనమనోహరంగా దర్శనమిచ్చాడు. అర్చకులు కృష్ణ తత్వాన్ని వివరించారు. ఇస్కాన్ టెంపుల్‌లో ఉట్టి వేడుకలు సందడిగా జరిగాయి. ఉట్టి కొట్టడానికి యువత పోటీ పడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



ఇస్కాన్ టెంపుల్‌లో పూల అలంకరణలో రాధాకృష్ణులు



గౌడియ మఠంలో పూల అలంకరణలో రాధాకృష్ణులు

ఆవాసాలు బుగ్గిపాలు

- కర్లపాలెం లంకకాలువ కట్టపై తొమ్మిది పూరిళ్లు దగ్ధం
- కట్టుబట్టలతో మిగిలిన పేద గిరిజనులు
- బాధితులను పరామర్శించిన కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

కర్లపాలెం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తొమ్మిది పూరిళ్లు దగ్ధమైన సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండల కేంద్రంలోని లంక కాలువ కట్టపై సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. లంక కాలువ కట్టపై నిరుపేద గిరిజనులు పూరిళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని వీరంతా రోజూ మాదిరిగానే ఉదయాన్నే పొలం పనులకు, చెరువుల వద్ద కాపాలా ఉండేందుకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు క్షణాల్లోనే పెద్దఎత్తున ఎగసి పడ్డాయి. పక్కన ఉన్న గృహాలకు కూడా అంటుకున్నాయి. ఓ ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలి మంటలు ఉవ్వెత్తున ఎగసి క్షణాల్లో తొమ్మిది ఇళ్లకు అంటుకున్నాయి. ప్రమాదంలో ఈగా కల్పన, దాసరి ఈశ్వరి, కొమ్మరగిరి శివయ్య, చవుటూరి కోటేశ్వరరావు, తుపాకుల తిరుమలేశ్వరరావు, గంధం వెంకటేశ్వరమ్మ, నక్కా సుబ్బారావు, ఈగా పెద్దియ్య, కోనేటి పోతురాజులకు చెందిన పూరిళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలు, ఆధార్, రేషన్‌కార్డులు, దుస్తులు, వంటపాత్రలు పూర్తిగా దగ్ధమయ్యాయి.



ఆహుతైన గిరిజనుల గృహాలు

ప్రమాదం జరిగిన విషయం తెలుసుకుని ఇళ్లకు చేరుకున్న గిరిజనులు భోరున విలపించారు. ఈగా పెద్దియ్య అనే యువకుడు తన వివాహానికి దాచుకున్న రూ.70వేల నగదు కాలిపోయిందని తెలిపాడు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. బాధితులకు తక్షణ సహాయంగా వేగేశన ఫౌండేషన్ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రముఖ ఆక్వా వ్యాపారి, రైతు వెంకట నారాయణ బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.10వేలుచొప్పున అందజేస్తామని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బాధితులకు నివాస గుడారాలు అందజేశారు.

ప్రభుత్వపరంగా ఆదుకుంటాం: కలెక్టర్

బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుని పక్కా గృహాలు నిర్మిస్తామని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. గిరిజనుల ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయని తెలుసుకున్న ఆయన జేసీ సుబ్బారావు, ఆర్డీవో గంధం రవీందర్‌తో కలసి ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. తక్షణ సహాయంగా బాధితులకు ఒక్కొక్కరికీ రూ.5వేల నగదు, 25కేజీల బియ్యం, కంది పప్పు, దుప్పట్లు, దుస్తులు అందజేశారు.

ఆర్టీసీ 'ప్రథమ' నిర్లక్ష్యం

- బస్సుల్లో కానరాని ఫస్ట్ ఎయిడ్ కిట్లు
- అలంకారప్రాయంగా బాక్సులు
- ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స కూడా కరువు

పట్నంబజారు: ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల భద్రతను గాలికి వదిలేశారు. ప్రయాణ సమయంలో చిన్న ప్రమాదం జరిగినా ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్)కిట్లు మాత్రం బస్సుల్లో మచ్చుకైనా కనపడటం లేదు. పలు బస్సుల్లో బాక్సులు ఉన్నప్పప్పటికీ, అవి అలంకారప్రాయంగా మారాయనే చెప్పవచ్చు. అయితే బాక్సుల్లో పూర్తిస్థాయిలో అన్ని వస్తువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్న కనీస విషయాన్ని ఆర్టీసీ అధికారులు విస్మరించారు. ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం మొద్దునిద్ర పోతోంది. మందుల కొనుగోలుకు నిధులు కేటాయించకపోవడంతో ఆర్టీసీ అధికారులు ఆసుపత్రులు, దాతల కోసం ఎదురు చూస్తున్నారు.

అధికారుల అలసత్వం

గుంటూరు రీజియన్ పరిధిలో మొత్తం ఐదు డిపోలున్నాయి. గుంటూరు 1, 2, తెనాలి, పొన్నూరు, మంగళగిరి కలిపి మొత్తం 369 ఉండగా, అందులో 80 వరకు హైర్ బస్సులు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా నిత్యం 80వేల నుండి 70వేల వరకు ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో వారి గమ్యస్థానాలు చేరుకుంటారని గణాంకాలు చెబుతున్నాయి. నిత్యం 1800 ట్రిప్పుల నుంచి 2000వేల ట్రిప్పుల వరకు బస్సులు పయనిస్తున్నాయి. నిత్యం రీజియన్‌లో ఆర్టీసీ ఆదాయం రూ.60లక్షల పైమాటే. ఫస్ట్ ఎయిడ్ బాక్సుల నిర్వహణలో అధికారుల అలసత్వంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. సిబ్బంది చెప్పినా పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరిగిన సమయంలో మందులు, సామగ్రి ఉంటే ఆసుపత్రికి తీసుకునే వెళ్లే సమయంలో డ్రైవర్, కండక్టర్లు ప్రథమ చికిత్స చేసే అవకాశం ఉంటుంది. ఆర్టీసీ సిబ్బందికి శిక్షణ సమయంలో కచ్చితంగా, ప్రథమ చికిత్స గురించి తర్ఫీదు నిస్తారు. బాక్స్‌లో మందులు, సామగ్రి లేకపోవడంతో సిబ్బంది కూడా చేసేదిలేక గాయపడిన వారిని ఆస్పత్రులకు తీసుకెళుతున్నారు.



ఫస్ట్ ఎయిడ్ కిట్‌లో కనిపించని అత్యసవర చికిత్స సామగ్రి

అన్ని బస్సుల్లో ఏర్పాటు

రీజియన్ పరిధిలోని ఆయా డిపోల అధికారులతో మాట్లాడి అన్ని బస్సుల్లో మెడికల్ కిట్లు ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆర్టీసీ వైద్య అధికారులతో మాట్లాడి కిట్ ఏర్పాటు చేసి కృషి చేస్తాం. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకుంటాం.

– ఎం. రవికాంత్, ఆర్టీసీ ఆర్ఎం

బాక్సుల్లో ఉండాల్సిన సామగ్రి

స్టెరిలైజ్డ్ కాటన్ బండిల్స్–2, ఎలాస్టిక్ బాండేజ్ రోలర్స్–5, బెటాడియన్ ఆయింట్‌మెంట్ (యాంటీ సెప్టిక్ క్రీమ్) 1, డెటాల్ లేక స్యావ్‌లాన్– 1, నియోస్పిన్ పౌడర్ డబ్బా–1, సర్జికల్ బ్లేడ్–1, బర్నాల్ ఆయింట్‌మెంట్–1, వాటర్‌ప్రూఫ్ ప్లాస్టర్, వైట్ ప్లాస్టర్ టేప్–1, బ్యాండ్ ఎయిడ్ ప్లాస్టర్, స్టెరిలైజ్డ్ ఎలాస్టిక్ ప్లాస్టర్–3 ఉండాలి.



క్లుప్తంగా

మార్కెట్‌లోకి 'ఇంప్లిసిట్' విడుదల



నగరంపాలెం: వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రపంచ పేరొందిన భారతీయ బహుళజాతి సంస్థ పారిజాత్ ఇండస్ట్రీస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ నూతన ఉత్పాదన 'ఇంప్లిసిట్' పురుగుల మందును సోమవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. గుంటూరు అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో పురుగుల మందును మేనేజర్ ఉమెన్ ఉమేస్, సౌత్ మార్కెటింగ్ హెడ్ మధుసూదనరావు, బిజినెస్ యూనిట్ లీడర్ రమణారెడ్డి, జోనల్ మార్కెటింగ్ మేనేజర్ భార్గవ్, రీజినల్ శ్రీకాంత్ సంయుక్తంగా విడుదల చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలు, అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించిన కీటకనాశిని 'ఇంప్లిసిట్' పురుగుల మందు అని పేర్కొన్నారు. సౌత్ మార్కెటింగ్ హెడ్ మధుసూదనరావు మాట్లాడుతూ అన్నిరకాల క్రిమిసంహారక మందులతో పాటు మొక్కలకు పోషకాలు అందించే ఉత్పత్తి పారిజాత్ పోర్ట్‌ఫోలియో అని చెప్పారు. బిజినెస్ యూనిట్ లీడర్ రమణారెడ్డి మాట్లాడుతూ ఇంప్లిసిట్ అద్భుతమైన క్రిమిసంహారిణి మందుని తెలిపారు. మిరప పంటలో తామర, లద్దె పురుగులు, నల్లి ప్రభావం ఎక్కువని, దాని నివారణలో ఇంప్లిసిట్ సమర్థంగా పని చేస్తుందని చెప్పారు. దీర్ఘకాలం పంటలపై వాటిని నియంత్రించడమేగాక పంటలకు సంరక్షణ ఇస్తుందని తెలిపారు.

29న జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు

చీరాల రూరల్: ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో ఈనెల 29 మధ్యాహ్నం 3:30 గంటలకు జిల్లా ఫుట్‌బాల్ మెన్, ఉమెన్ సీనియర్స్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసిమల్లి విజయకుమార్, జోనల్ ఇన్‌చార్జ్ నూతలపాటి దేవదాసు, క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్యలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు తమవెంట ఆధార్ కార్డులు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తెచ్చుకోవాలని సూచించారు.



దేశవ్యాప్తంగా మార్పు రావాలి

కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై జరిగిన ఘటన అత్యంత దారుణం. వీటికి అడ్డుకట్ట వేయాలంటే చట్టాలతో పాటు దేశవ్యాప్తంగా ప్రజల్లో మార్పురావాలి. వైద్యులకు, వైద్య సిబ్బందికి నూరు శాతం రక్షణ అవసరం. పోలీసులు నిరంతరం నిఘా ఉంచాలి. ముఖ్యంగా రాత్రిపూట విధులు నిర్వహించే సిబ్బందికి అందుబాటులో ఉంటే రక్షణగా ఉంటుంది.

–బి.సునందకుమారి, సామాజిక ఆరోగ్య కేంద్రం , కొల్లిపర, ఫార్మాసిస్ట్





దాడి అమానవీయం

ప్రాణాపాయస్థితిలో ఉన్న వారి ప్రాణాలు నిలిపే వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడటం చాలా ఘోరం. ఆస్పత్రుల్లోని భద్రతా వైఫల్యాల్ని ఈ ఘాతుకం తేటతెల్లం చేస్తోంది. రానున్న రోజుల్లో ఇటువంటి ఘటనలు మరలా జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. వైద్యులకు, సిబ్బందికి రక్షణ కల్పించే చట్టాన్ని వెంటనే అమలులోకి తీసుకు రావాలి.

–ఎస్.శ్రీలక్ష్మి, సామాజిక ఆరోగ్య కేంద్రం, కొల్లిపర, ల్యాబ్ టెక్నీషియన్

శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట వివాదాస్పదం

విగ్రహాన్ని తొలగించేందుకు కూటమి ప్రభుత్వం విశ్వప్రయత్నం

పెదకాకాని: శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట వివాదాస్పదం కావడంతో పోలీసు పికెట్ కొనసాగుతోంది. పెదకాకాని మండలంలోని అనుమర్లపూడిలో యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు సోమవారం ఉదయం శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్టతో పాటు పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట పురస్కరించుకుని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే క్రమంలో ఆదివారం రాత్రి పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. పసుపు రంగు ద్వారం వద్ద ఫ్లెక్సీలు కట్టవద్దని సూచించడంతో దూరంగా ఒకదాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో వివాదాలు చోటు చేసుకునే పరిస్థితులు దృష్ట్యా పోలీసులు ఉదయం నుంచి పికెట్ ఏర్పాటు చేశారు. 2022 జులై 30న పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆర్చి పక్కన రోడ్డు మార్జిన్‌లో శ్రీకష్ణుని విగ్రహం ఏర్పాటు చేసుకునేందుకు గ్రామ పంచాయతీ కూడా తీర్మానం చేసింది.



అనుమర్లపూడిలో ప్రతిష్ఠించిన విగ్రహం

ఆ సంవత్సరమే విగ్రహ ఏర్పాటుకు గానూ డ్రెయిన్, రోడ్డుకు మధ్యలో పునాది కూడా వేశారు. అంతకు ముందే డ్రెయిన్ నిర్మించే సమయంలో చెరువు పోరంబోకులో వేసిన పశువుల చావిడి ఖాళీ చేయాలని పంచాయతీ నుంచి మూడు పర్యాయాలు అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. రెండేళ్లుగా విగ్రహం ఏర్పాటు చేసుకునే సమయంలో ఫిర్యాదు చేయడం, ప్రతిష్ట చేసిన శ్రీకృష్ణుని విగ్రహాన్ని తీయాలని ఒత్తిడి చేయడం దారుణంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరి నార్త్ డీఎస్పీ ఎస్. మురళీకృష్ణ, సీఐ టి. నారాయణస్వామి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రాత్రి రెండువర్గాల్ని పోలీసుస్టేషన్‌కు పిలిపించి గ్రామంలో శాంతిభద్రతల దృష్ట్యా చర్చలు జరిపారు. ఆ ప్రదేశంలో ఉన్న దేవుని విగ్రహాన్ని మరెక్కడైనా గుడిలో పెట్టుకోవాలని సూచించారు. ప్రతిష్ఠించిన విగ్రహాన్ని తమ చేతులతో తీయలేమని, పంచాయతీ తొలగించుకోవచ్చని, ఆ ప్రదేశానికి రామంటూ సంతకాలు చేశామని అనుమర్లపూడి గ్రామవాసి, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్వామివారి విగ్రహాన్ని తొలగించేందుకు రాత్రికి ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. గ్రామానికి పోలీసు ఫోర్స్ చేరుకుంది.

వచ్చే నెల 25న చెకుముకి సంబరాలు



సైన్స్ సంబరాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జేవీవీ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనల్ని పెంపొందించేందుకు సైన్స్‌పై ఆసక్తి, ప్రశ్నించే తత్వాన్ని ప్రేరేపించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గత 34 ఏళ్లుగా చెకుముకి సైన్స్ సంబరాల్ని నిర్వహిస్తున్నట్లు గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం సైన్స్ సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 25న పాఠశాల స్థాయి, అక్టోబర్ ఒకటిన మండల స్థాయి, అక్టోబర్ 27న జిల్లా స్థాయి, నవంబర్ 9,10వ తేదీల్లో రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల విద్యార్థులు పాల్గొనే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు బి. ప్రసాద్, టి. జాన్‌బాబు, ఏ.ఎస్. ప్రసాద్, జి. వెంకటరావు, బి. ఉదయ్ భాస్కర్, బి. శంకర్‌సింగ్, ఎండీ అక్బర్, సుభాని, ఈ. అనిల్‌కుమార్, టి.ఆర్. రమేష్, టి.ఆర్. చాందిని పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు అన్నారు. కన్నావారితోటలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం గుంటూరు జోన్ కన్వీనర్ కేసన రమేష్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ జీవో 117 రద్దు చేయాలని కోరారు. 3,4,5 తరగతుల్ని ఉన్నత పాఠశాలల నుంచి వెనక్కు తీసుకుని ప్రాథమిక పాఠశాలల్లో ప్రారంభించడం ద్వారా ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రంలో ఒక్క తెలుగు మీడియం తప్పా ఒరియా, కన్నడ, తమిళ్, ఉర్దూ తదితర మాధ్యమాల్లో చదువుకోవడం తెలుగు విద్యార్థులు చేసుకున్న దురదృష్టమన్నారు. తక్షణమే తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. ఉపాధ్యాయులు వృత్తికి పునరంకితం కావడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్ని కాపాడుకోవాలని సూచించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ విద్యాశాఖాధికారుల నిర్ణయాలతో మిగులు ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియ గందరగోళానికి దారితీసిందని



మాట్లాడుతున్న పాండురంగ వరప్రసాదరావు

విమర్శించారు. ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు షేక్ జిలానీ మాట్లాడుతూ డీఏ పెండింగ్ బకాయిలు విడుదలతో పాటు ప్లస్ 2 పాఠశాలల్లో ఖాళీల్ని వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఫిరంగిపురం, తాడికొండ మండలాల నుంచి ఎస్టీయూ శాఖ కార్యకర్తలు, నాయకులు టి.భాస్కర్, చక్కా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కబీర్, జహంగీర్, జఫరుల్లా, వెంకటేశ్వర్లు, అప్పారావు తదితరులు ఏపీటీఎఫ్‌లో చేరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ, పి.పార్వతి, జిల్లా కార్యదర్శి లు ఎస్.ఎస్.ఎన్ మూర్తి, జి.దాస్, రాష్ట్ర కౌన్సిలర్ చెత్తిపోగు లక్ష్మణ్ కుమార్, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి హనుమంతరావు పాల్గొన్నారు.

ఎల్ఐసీ జోనల్ గేమ్స్ చీఫ్ రిఫరీగా అబ్దుల్ జలీల్



గుంటూరు వెస్ట్ (క్రీడలు): వైఎస్సార్ కడపలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న ఎల్ఐసీ ఆఫ్ ఇండియా జోనల్ క్రీడా పోటీలకు చీఫ్ రిఫరీగా గుంటూరుకు చెందిన ప్రముఖ క్యారమ్స్ క్రీడాకారుడు షేక్ అబ్దుల్ జలీల్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఎల్ఐసీ కార్యాలయం నుంచి ఆయనకు ఆదేశాలందాయి. గతంలో జలీల్ భారత క్యారమ్స్ జట్టు సభ్యునిగానూ, ఇండియా జట్టు కోచ్‌గానూ పని చేశారు. 2013లో కోల్‌కతాలో జరిగిన ఏడు దేశాల సార్క్ క్యారమ్స్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు బంగారు పతకం గెలుపొందింది. ఈ జట్టుకు కోచ్‌గా జలీల్ వ్యవహరించారు. ప్రస్తుతం జలీల్ ఆంధ్ర రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఎల్ఐసీ సంస్థతో కూడా ఆయనకు అనుబంధముంది.

మైనర్‌పై పోక్సో కేసు నమోదు

తాడికొండ: మైనర్ బాలికను ప్రేమ పేరుతో ఓ మైనర్ బాలుడు వేధించిన ఘటన తాడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండలో ఓ మైనర్ బాలికపై సమీపంలోని ఇంటికి చెందిన మరో మైనర్ బాలుడు ప్రేమ పేరుతో వేధించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తిస్తుండగా కేకలు వేసింది. కుటుంబ సభ్యులు గమనించి పట్టుకునేందుకు యత్నించగా నిందితుడు పారిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె. వాసు తెలిపారు.

రైలులో ప్రయాణికుడి మృతి

తెనాలి రూరల్: రైలులో ప్రయాణికుడు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఒడిశాలోని గంజాం బోరాడకు చెందిన బలరాం ప్రధాన్(66) కొట్టాయంలో ఇటుక బట్టీలలో పని చేసేందుకు వెళ్లాడు. ఆరోగ్యం బాగుండక పోవడంతో అక్కడ వైద్యులకు చూపించుకుని స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా తెనాలి సమీపంలో రైలులో మృతి చెందాడు. మృతుని బంధువులు రైల్వే అధికారులకు చెప్పడంతో తెనాలి జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి సోమవారం రాత్రి తెలిపారు.

ఓపిక పట్టు.. చేపను పట్టు



ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో పాము పక్షికి చిక్కిన చేప పిల్ల

సృష్టిలో అల్ప జీవుల్ని బలమైన జీవులు వేటాడి తినడం సహజమే. ఇందులో ఒకో జంతువుదీ ఒకో రకమైన పద్ధతి. పులి మాటు వేసి, నక్కలు జిత్తులు వేసి వేటాడదాయి. ఇందులో పాము పక్షి వేట అబ్బుర పరుస్తుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ , గుంటూరు

టోకెన్లు ఉన్న రైతులకే ఇసుక సరఫరా

- నిర్ణీత సమయానికే స్టాక్ పాయింట్‌కు రావాలి
- ఇన్‌చార్జి ఆర్డీవో ఎం. గంగరాజు

తాడికొండ: ముందు రోజు టోకెన్లు తీసుకున్న వారు మాత్రమే ఇసుక బుకింగ్ కేంద్రాల వద్దకు రావాలని గుంటూరు ఇన్‌చార్జి ఆర్డీవో ఎం. గంగరాజు తెలిపారు. లారీలు తీసుకొచ్చి రోడ్లపై అడ్డుగా నిలుపకూడదని ఆయన స్పష్టం చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం, లింగాయపాలెం గ్రామాల్లోనే స్టాక్ పాయింట్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఇసుక కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి వినియోగదారులు వస్తున్నందున రద్దీ అధికంగా ఉంటుందని తెలిపారు. సెప్టెంబర్ 11వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నూతన విధానంలో ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం అవుతుందని చెప్పారు. అప్పటి వరకు జిల్లాలోని గుంటూరు ఆర్డీవో కార్యాలయంతో పాటు తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి తహసీల్దార్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ బుకింగ్ ఏర్పాటు చేశారని తెలిపారు. వినియోగదారులంతా కేంద్రాల్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతిరోజు సాయంత్రం మరుసటి రోజుకు టోకెన్లు పంపిణీ ఉంటుందన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టోకెన్లు ఉన్న వారికి ఇసుకను అందిస్తామని తెలిపారు. స్టాక్ పాయింట్లలో సరిపడా ఇసుక ఉన్నందున కంగారుపడాల్సిన అవసరం ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని అధికారులకు సహకరించేలా లారీల డ్రైవర్లు, ఓనర్లు సహకరించాలని ఆయన కోరారు.

మణిపాల్‌లో 300 రోబోటిక్ సర్జరీలు పూర్తి

తాడేపల్లి రూరల్: మణిపాల్ హాస్పిటల్‌లో 300 రోబోటిక్ సర్జరీలు పూర్తయినట్లు సోమవారం ఒక ప్రకటనలో హాస్పిటల్ డైరెక్టర్ సుధాకర్ కంటిపూడి తెలిపారు. రోబోటిక్ సర్జరీలలో గ్యాస్ట్రో ఎంటరాలజీ, యూరాలజీ, గైనకాలజీ, సర్జికల్ అంకాలజీతో సహా పలు విభాగాల్ని ఆస్పత్రి కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ శస్త్రచికిత్సలకు బాధ్యత వహించే ప్రత్యేక బృందంలో కన్సల్టెంట్, జీఐ అండ్ మినిమల్ యాక్సెస్ సర్జన్ డాక్టర్ సురేంద్ర జాస్తి, సర్జికల్ ఆంకాలజీ కన్సల్టెంట్ డాక్టర్ వి. ధర్మేంద్ర కుమార్, న్యూరాలజిస్ట్ కన్సల్టెంట్, మూత్ర పిండ మార్పిడి సర్జన్ డాక్టర్ రవి శంకర్ గంజి, సర్జికల్ ఆంకాలజీ కన్సల్టెంట్ డాక్టర్ ఆర్. దినేష్‌రెడ్డి, ప్రసూతి అండ్ గైనకాలజీ కన్సల్టెంట్ డాక్టర్ లక్ష్మీ ప్రసూన, మెడికల్ సర్వీసెస్ హెడ్ డాక్టర్ ఉత్తమ్ శర్మలు ఉన్నారని ఆయన వెల్లడించారు. రోబోటిక్ సర్జరీల్లో అత్యాధునిక ఇంట్యూటివ్ - డావిన్సీ షి రోబోటిక్ సిస్టమ్‌ను ఉపయోగిస్తామని తెలిపారు. సంప్రదాయ శస్త్ర చికిత్సలతో పోలిస్తే తక్కువ నొప్పి, చిన్న కోతలు, తక్కువ రక్త స్రావం, వేగంగా కోలుకునే విధానం రోగులకు ప్రయోజనాలను అందిస్తుందని వివరించారు. 99 శాతం సక్సెస్ రేటుతో ఫలితాలు చాలా సానుకూలంగా ఉన్నాయని తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు మణిపాల్ హాస్పిటల్ కట్టుబడి ఉందన్నారు. ప్రపంచస్థాయి ఆరోగ్య సంరక్షణను అందించడానికి మణిపాల్ వైద్యులు నిరంతరం ప్రయత్నాలు చేస్తారని డాక్టర్ సుధాకర్ కంటిపూడి తెలిపారు.

విజ్ఞాన్ నిరుల అధ్యాపకులకు అవార్డులు



అవార్డులు పొందిన అధ్యాపకులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: తమ కళాశాల అధ్యాపకులకు విప్రో ధ్రువీకృత అవార్డు రావడం సంతోషంగా ఉందని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన అధ్యాపకుల అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వి. పావనికి ఉపాధ్యాయుల విభాగంలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ సమ్మిట్– 2024లో డిజిటల్ ఇన్నోవేటర్స్ ఆఫ్ టుమారో అవార్డు లభించిందన్నారు. డాక్టర్ వి పావని, జి రోహిణి ఫణీంద్రకుమారిలను విప్రో సంస్థ తమ ధ్రువీకృత అధ్యాపకులుగా గుర్తించి అవార్డును అందజేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తమ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరెన్నో సాంకేతిక ఆవిష్కరణలు చేసే దిశగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి గుర్తింపుతో పాటు డిజిటల్ ఇన్నోవేషన్ రంగంలో అగ్రస్థాయిలో ఉన్న కళాశాలగా విజ్ఞాన్ నిరుల గుర్తింపబడటం గొప్ప విషయమని కళాశాల ఐటీ విభాగాధిపతి డాక్టర్ కె.వి.ఎస్.ఎస్. రామకృష్ణ, కళాశాల ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ సమన్వయకర్త డాక్టర్ కె.సత్యసందీప్ తెలిపారు. చివరగా అవార్డులు పొందిన అధ్యాపకులను పలువురు అభినందించారు.

హరేకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



మందిరంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లి రూరల్: ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఇస్కాన్ టెంపుల్ (హరేకృష్ణ మందిరం)లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర అధ్యక్షులు చక్రధారి ప్రభు మాట్లాడుతూ ఉదయం 4.30 గంటలకు శ్రీశ్రీ రాధాశ్యామ్ సుందర్‌కు ధూప, దీప హారతలు, కీర్తనలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం స్వామికి పంచామృతాలతో కలశ అభిషేకం నిర్వహించామని పేర్కొన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు సుజనా చౌదరి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారని, సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. శ్రీకృష్ణ భగవానుడు నడయాడిన బృందావన నమూనాను తయారు చేసి అక్కడ నిర్వహించిన ఊంజల్ సేవ అందరినీ ఆకట్టుకుందని పేర్కొన్నారు. రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు స్వామికి మహా శంఖాభిషేకం, మహా హారతి, ఘన కీర్తనలు, 108 రకాల పిండివంటలతో భోగా అర్పించడంతో వేడుకలు ముగుస్తాయని చక్రధారి ప్రభు తెలిపారు.

జిల్లా బాలబాలికల ఆట్యా-పాట్యా జట్టు ఎంపిక

నకరికల్లు: రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటి పల్నాడుకు మంచిపేరు తీసుకురావాలని ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య క్రీడాకారులను కోరారు. పల్నాడు జిల్లాస్థాయి ఆట్యా-పాట్యా బాలబాలికల జట్టుకు సెలక్షన్సను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సోమవారం నిర్వహించారు. పల్నాడు జిల్లాలోని పలుపాఠశాలల నుంచి సుమారు 80మందికి పైగా బాలబాలికలు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో నైపుణ్యాలను పరీక్షించి జిల్లాస్థాయి జట్టును ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 14, 15వ తేదీలలో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన జట్టు పాల్గొంటుందని అన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు జి.ఝాన్సీరాణి, తిరుమలబాయి, క్రీడా ఉపాధ్యాయుడు జానకీరామయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న 11 మంది అరెస్ట్

- 23.5 కిలోల గంజాయి, రెండు బైక్‌లు స్వాధీనం
- డీసీపీ హరికృష్ణ వెల్లడి



సీజ్ చేసిన గంజాయితో పాటు నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ హరికృష్ణ తదితరులు

విజయవాడ స్పోర్ట్స్: జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు దోపిడీ, దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా మార్గాలను ఎంచుకున్న 11 మందిని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం అరెస్ట్ చేసింది. నిందితుల నుంచి రూ. 2.60 లక్షల విలువైన దొంగ సొత్తుతో పాటు 23.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డెప్యూటీ పోలీస్ కమిషనర్ (డీసీపీ) హరికృష్ణ కమాండ్ కంట్రోల్ రూంలో మీడియాకు సోమవారం వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే... ఎన్టీఆర్ జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చాలనే సదుద్దేశంతో జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు నిర్దేశించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను యాంటీ నార్కోటిక్ సెల్, లా అండ్ ఆర్డర్ బృందాలు సమర్థంగా నిర్వహిస్తున్నాయి. దీనిలో భాగంగానే గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. తాజాగా యాంటీ నార్కోటిక్ సెల్, లా అండ్ ఆర్డర్ పోలీసులకు వచ్చిన సమాచారంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న 11 మందిని అదుపులోకి తీసుకుని విచారించాం. వీరిలో ఎన్టీఆర్ జిల్లా కొత్తపేటకు చెందిన కొండ రమేష్, అజిత్ సింగ్‌నగర్‌కు చెందిన నేలటూరి ప్రవీణ్, ఏలూరు జిల్లా నూజివీడు చెందిన గురవర్తి నాగరాజు, షేక్ సిద్దిక్ హుస్సేన్‌బాషా, చుడిమేల్ల గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటేష్, కృష్ణా జిల్లా గంగూరుకు చెందిన పటాన్ జియాఖాన్, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన సుమన్ బిసోయ్, సాగర్ జెనాలతో పాటు అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన ముగ్గురు మైనర్లు ఉన్నారు. నిందితులందరూ గంజాయి మత్తుకు అలవాటు పడి, సులభంగా డబ్బులు సంపాదించడానికి దొంగతనాలను, దోపిడీలను, గంజాయిని అక్రమంగా రవాణా చేసే మార్గాన్ని ఎంచుకున్నారు. దీని కోసం ఒడిస్సా ఏజెన్సీ నుంచి గంజాయిని కొనుగోలు చేసి విజయవాడలోని యువకులకు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. వీరిలో సాగర్ జెనా, కొండా రమేష్, గురవర్తి నాగరాజు, షేక్ సిద్దిక్, నేలటూరి ప్రవీణ్ గతంలో గంజాయి అక్రమ రవాణా కేసులో అరెస్ట్ అయ్యి జైలు జీవితం అనుభవించారు. కొండా రమేష్, గురవర్తి నాగరాజు, షేక్ సిద్దిక్‌లు ఓ మైనర్‌తో కలిసి వీరవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక రాయల్ ఎన్ ఫీల్డ్‌ను దొంగిలించడంతో పాటు ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై దాడి చేసి అతని డ్యూక్ బైక్‌ను లాక్కున్నారు. మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురి సెల్‌ఫోన్లను, జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వస్త్ర దుకాణంలో దుస్తులు దొంగిలించారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, దుస్తులు, స్వాధీనం చేసుకున్నాం. నిందితులందరిపై కేసులు నమోదు చేశాం. యాంటి నార్కోటిక్ సెల్ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 120 మందిపై 35 కేసులు నమోదు చేసి 239 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డీసీపీ వెల్లడించారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ శ్రీహరిబాబు, సీఐలు పవన్‌కిషోర్, కొండలరావు, రమేష్ పాల్గొన్నారు.